వ్యర్థాలతో దుర్గంధం

- డ్రెయినేజీలుగా మారుతున్న పంటకాలువలు
- కోడూరులోని 11, 13 నంబర్ పంటకాలువల దుస్థితి
- 30కి పైగా అక్రమ తూములు
- ఉల్లిపాలెం రక్షిత మంచినీటి చెరువుకు 11వ నంబర్ కాలువ నీరే
- 13వ నంబర్ కాలువలోకి చేపలు, రొయ్యల వ్యర్థాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


11వ నంబర్ పంటకాలువలో మురుగు తూము

కోడూరు: పంటకాలువలు డ్రెయినేజీలను తలపిస్తూ తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతున్నాయి. కోడూరు మండలంలోని 11, 13వ నంబర్ పంటకాలువలు అధ్వానంగా మారాయి. అధికారులు పట్టించుకోక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

11వ నంబర్ కాలువ దుస్థితి..

కోడూరు వంతెన సెంటర్ నుంచి ఉల్లిపాలెం వరకు 11వ నంబర్ కాలువ ప్రవహిస్తుంది. ఈ కాలువ వెంట సుమారు నాలుగు వేల ఎకరాలకు సంబంధించిన పంట పొలాలకు సాగునీరు వెళ్లాలి. ఉల్లిపాలెంలోని రక్షిత మంచినీటి చెరువుకు కూడా ఈ కాలువ ద్వారా నీటిని నింపుకోవాలి. ప్రస్తుతం ఈ 11వ నంబర్ పంటకాలువ సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలకు నిలయంగా మారింది. కోడూరు బైపాస్ రహదారి వెంట ఈ కాలువ ప్రవహిస్తుండగా, రహదారి పక్కన ఉన్న గృహస్తులందరూ తమ ఇళ్లలో నుంచి వ్యర్థాలను ఈ కాలువలోకి వెళ్లేలా అక్రమంగా తూములు ఏర్పాటు చేశారు. వంతెన సెంటర్ నుంచి తూర్పు వైపు వరకు సుమారు 30 అక్రమ తూములు ఏర్పాటు చేసి ఇళ్లలో మురుగును ఈ కాలువలోకి విడుదల చేస్తున్నారు. కొంతమంది సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను కూడా కాలువలోకే వదిలిపెడుతున్నారు.

ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే..

11వ నంబర్ పంటకాలువ వెంట ప్రయాణించే వారు ముక్కు మూసుకొని వెళ్లాలి. ఈ కాలువ పక్కన మూడు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఉల్లిపాలెంలోని రక్షిత మంచినీటి చెరువుకు కూడా ఈ కాలువ ద్వారానే తాగునీటిని మళ్లించాల్సి ఉంది. అయితే సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను కూడా గృహస్తులు కాలువలోకి విడుదల చేయడంతో తాగునీరు కలుషితమవుతున్నాయని ఉల్లిపాలెం పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. చెరువులోకి మళ్లించిన నీరు తాగేందుకు ఉపయోగ పడడం లేదని, కేవలం పశువుల అవసరాల కోసమే వినియోగించుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

13వ నంబర్ కాలువలో..

కోడూరులోని మెరకగౌడపాలెం నుంచి ప్రారంభమయ్యే 13వ నంబర్ కాలువలోకి వీవర్స్‌కాలనీ, మెరకగౌడపాలెం ప్రాంతాల్లో ఉన్న చేపలు, రొయ్యల కంపెనీల యజమానులు వాటి వ్యర్థాలను ఈ కాలువలోనే కుప్పలుగా పోస్తున్నారు. సమీపంలోని గృహస్తులు ఈ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


వ్యర్థాలతో నిండిన 13వ నంబర్ పంటకాలువ

గతంలో ఈ కాలువ చుట్టూ ఉన్న గృహస్తులు అంటువ్యాధుల బారిన పడి ఆసుపత్రి పాలైన ఘటనలు ఉన్నాయి. చేపలు, రొయ్యల కంపెనీల యజమానులకు పంచాయతీల అధికారులు వ్యర్థాలను కాలువలో వేయవద్దంటూ నోటీసులిచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని సమీప గృహస్తులు వాపోతున్నారు.

అంటువ్యాధులు ప్రబలే అవకాశం..

11, 13 నంబర్ పంటకాలువలు డ్రెయినేజీలను తలపిస్తున్నాయి. ఇక్కడ దోమల ఉత్పత్తి కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సాగుకు కాలువలకు సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంది. ఈ లోపు కాలువల్లో వ్యర్థాలు వేయకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ తూములు తొలగించాలి..



కోడూరు బైపాస్ రహదారి వెంట ఉన్న గృహస్తులు 11వ నంబర్ పంటకాలువలోకి అక్రమంగా తూములు ఏర్పాటు చేసి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను కాలువలోకి విడుదల చేస్తున్నారు. ఈ వ్యర్థాల కారణంగా ఉల్లిపాలెం రక్షిత మంచినీటి చెరువులోని నీరు తాగేందుకు ఉపయోగపడడం లేదు. పంచాయతీల అధికారులు స్పందించి వెంటనే కాలువలోకి ఏర్పాటు చేసిన తూములను తొలగించాలి.

– కమ్మిలి కోటేశ్వరరావు, ఉల్లిపాలెం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



కోడూరులోని 11, 13 నంబర్ పంటకాలువల్లోకి సమీప గృహస్తుల మురుగు, సెప్టిక్ పైపులు ఏర్పాటుపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు రాలేదు. గృహాల్లో నుంచి పంటకాలువలోకి డ్రెయినేజీ పైపులు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల పైపులు వేయడం చట్టరీత్యా నేరం. చేపలు, రొయ్యల వ్యర్థాలు కాలువల్లోకి వేయడం వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పంట కాలువలను పరిశీలించి, తూములు ఏర్పాటు చేసినవారిపై చర్యలు తీసుకుంటాం.

– బండే శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి, కోడూరు

క్లుప్తంగా

జాతీయ రహదారిపై ప్రమాదకరంగా గుంత



కృత్తివెన్ను: జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. మండలంలోని గరిశపూడి అండర్ టన్నెల్ సమీపంలో 216 జాతీయ రహదారిపై భారీ గుంత ఏర్పడింది. ఈ కారణంగా వాహనదారులకు పెనుప్రమాదం పొంచిఉంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలే కాకుండా కార్లుసైతం ఈ గుంత వద్ద ప్రమాదానికి గురయ్యేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు ఈ ప్రాంతంలో రహదారికి మరమ్మతులు చేసి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం




చల్లపల్లి: ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించటంలో ముందుంటామని ఎస్‌బీఐ మచిలీపట్నం రీజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఐ శాఖను ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుల సంయుక్త సహకారంతోనే ఇంత దూరం విజయవంతంగా ప్రయాణం సాగిందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఖాతాదారులను, అధికారులను ఘనంగా సన్మానించారు. బ్రాంచ్ మేనేజర్ వి.భారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వినోద్ కుమార్, గురు సంతోష్, ఏసుపాదం, మురళి, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వినూత్న నిరసన



చిలకలపూడి(మచిలీపట్నం): సమస్యల పరిష్కారం కోసం ఆయుష్మాన్ భారత్ ద్వారా పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శనివారం వినూత్న నిరసన తెలిపారు. ఉద్యమాన్ని ప్రారంభించి శనివారంతో 20 రోజులు కావస్తున్న నేపథ్యంలో వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా హృదయాకృతిలో ఏర్పడి నిరసన తెలిపారు. సంఘ ప్రతినిధి వి.నాగబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మా నిరసన ప్రదర్శనలకు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా ఆరు సంవత్సరాలు దాటిన వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. రెగ్యులర్ ఇంక్రిమెంట్లతో పాటు పీఎఫ్ చెల్లింపులు చేపట్టాలన్నారు. ఇన్సెంటివ్‌లు చెల్లించాలని కోరారు. దీంతో పాటుగా తాము నిర్వహిస్తున్న కేంద్రాల కరెంటు బిల్లులు, అద్దె బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



పెడన: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ శనివారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నట్లు సీఐయూటీ నాయకులు బూర సుబ్రమణ్యం, పంచల నరసింహారావులు తెలిపారు. అధ్యక్షుడిగా కైలా జ్ఞాన ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బంగారు రవిప్రసాద్, కార్యదర్శిగా బంగారు నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఏలేటి ఏసు, కోశాధికారిగా నాదెండ్ల శేషుబాబు ఎన్నికయ్యారన్నారు.

విభాగాలను పరిశీలించిన కమిషనర్

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో పలు విభాగాలను కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు శనివారం పరిశీలించారు. రెవెన్యూ, లీగల్, పరిపాలనా విభాగాలను పరిశీలించి ఫైళ్ల కదలికల వివరాలను గుమాస్తాలను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలకు సంబంధించిన ఫైళ్ల పరిస్థితిని తెలుసుకుని, వాటి పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. ఈ పరిశీలనలో రెవెన్యూ అధికారి ఎస్.వెంకటేష్, కార్యాలయ మేనేజర్ కేఎస్ ప్రసాద్, ఈ–1 గుమాస్తా లక్ష్మి, కోర్టు గుమాస్తా రామస్వామి తదితరులు ఉన్నారు.

తిరంగా యాత్ర.. వీర సైనికులకు శ్రద్ధాంజలి

పెడన: పట్టణంలో శనివారం ఉదయం తిరంగా యాత్ర నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తొలుత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు అర్పించిన వీరసైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సైనికులను ఉద్దేశించి వారి ధైర్యసాహసాలను, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రధాన మంత్రి మోదీ తీసుకున్న నిర్ణయాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొడ్డు వేణుగోపాలరావు, శెలపాటి ప్రసాద్, పోతన స్వామినాయుడు, జనసేన నాయకుడు పి.సురేష్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, వివిధ మండలాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తిరంగా యాత్రలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

భూ రీసర్వే వివరాల వెల్లడికే గ్రామసభ

వేములపల్లి(ఘంటసాల): గ్రామంలో జరిగిన భూ రీ సర్వే తర్వాత పూర్తిస్థాయి వివరాలను రైతులకు తెలియజేసేందుకే గ్రామ సభ నిర్వహించినట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. మండలంలోని వేములపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన భూ రీ సర్వే పూర్తయిన ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ ఆర్ఓఆర్) గ్రామ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వేములపల్లి గ్రామం పరిధిలో 613.326 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఉన్నట్లు గుర్తించడంతో పాటు వాటికి 712 ఎల్.పి.(ల్యాండ్ పార్శిల్) నంబరు కేటాయించినట్లు చెప్పారు. ఆయా ఎల్.పి. పరిధిలోని ప్రభుత్వ భూములు, రైతుల వివరాలు, వారి భూముల వివరాలను తెలియజేస్తూ గ్రామ సభలో అందరి సమక్షంలో తెలియజేసినట్లు తెలిపారు. ఏమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలోని రీ సర్వే చేసిన అనంతరం తయారు చేసిన తుది జాబితా అయిన 712 ఎల్.పి. నంబర్ల పరిధిలోని 613.326 ఎకరాలను వివరంగా చదివి వినిపించారు. అనంతరం గ్రామానికి చెందిన సూర్యదేవర ఉదయ భాస్కర్ మూడు సెంట్లు విస్తీర్ణం తగ్గిందని, మరలా సర్వే చేయాలని అధికారుల దృష్టికి తీసుకురాగా వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వీఆర్వో డి.మనీషా, సర్వేయర్ ఎం.మానస దేవి, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ ప్రసాద్, పక్కన రీసర్వే డీటీ

భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని కమిషనర్ బాపిరాజు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 5 అడుగుల వెడల్పు, 6 అడుగుల ఎత్తుకు మించిన బ్యానర్‌లను అనుమతులు లేకుండా పెట్టడం నేరమన్నారు. ఫ్లెక్సీబ్యానర్‌లు, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేసేవారు నగరపాలక సంస్థకు ఫీజులు చెల్లించాలన్నారు. ఏర్పాటు చేసిన వీటిని మూడు రోజుల్లోనే తొలగించాలన్నారు. అలా చేయని వారి ఫ్లెక్సీలు, బోర్డులను తమ సిబ్బందితో తొలగిస్తామని, దీనికి అయ్యే ఖర్చును సంబంధిత బ్యానర్, బోర్డుల వారి నుంచే జరిమానా రూపంలో వసూలు చేస్తామన్నారు. అనుమతి పొంది నగరంలో ఏర్పాటు చేసే బ్యానర్‌లు, బోర్డులు ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండాలన్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా బ్యానర్లు, బోర్డులు ఏర్పాటు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అధికారుల స్వచ్ఛాంధ్ర ర్యాలీ

మచిలీపట్నంటౌన్: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్యాటిల్ డిపో వద్ద ఈ వేస్ట్ చెక్‌ను నిర్వహించారు. అక్కడి నుంచి కోనేరుసెంటర్ వరకూ కార్యాలయ, సచివాలయ సిబ్బంది ర్యాలీ చేశారు. కోనేరుసెంటర్‌లో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన సిబ్బందికి మజ్జిగను అందజేశారు. వడదెబ్బ నివారణ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, పీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పాపవినాశనం(ఘంటసాల): మండలం పాపవినాశనం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంపటి అనిత మాట్లాడుతూ మన గ్రామం పరిశుభ్రంగా ఉంచి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. డెప్యూటీ ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పంచాయతీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ అన్వర్ షరీఫ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


సిబ్బందికి మజ్జిగ అందజేస్తున్న దృశ్యం

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం

మోపిదేవి: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారమని ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ పర్యావరణహితమే ప్రధాన లక్ష్యంగా ప్లాస్టిక్ ముప్పునుంచి సమాజానికి విముక్తి కల్పించాలని కోరారు. అనంతరం దేవస్థానం ఆవరణలో సిబ్బందిచే పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఆలయ సూపరింటెండెంట్స్ బొప్పన సత్యనారాయణ, అచ్యుత మధుసూదనరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పెడన: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ)ఆధ్వర్యంలో జూన్ 5న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ శాఖ పెడన మున్సిపల్ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఆదేశాల మేరకు జూన్ 5న 'చలో విజయవాడ' సమావేశానికి కృష్ణా జిల్లాలోని ఉద్యోగులను ఆహ్వానించారని నాయకులు తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని, ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించే అవకాశం ఉందాన్నారు. పెడన, బంటుమిల్లి మండలాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగులు కూడా హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా 'చలో విజయవాడ' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకునే నిమిత్తం జూన్ 5వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే 'చలో విజయవాడ' కార్యక్రమానికి జిల్లాలోని ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీజీఈఏ చల్లపల్లి మండల నాయకులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లపల్లి మండల శాఖ ప్రెసిడెంట్ తలుపుల శ్రవణ కుమార్, జనరల్ సెక్రటరీ పి నాగ ప్రసన్నలక్ష్మి, ట్రెజరర్ పుట్టి యోచిత, సభ్యులు పి.దేవబాబు, జి.నరేష్, వై.శామ్‌సన్, పంచాయతీ రాజ్ ఏఈ బి.శ్రీనివాస్, పూషడపు విష్ణు, పి.భవానీ శంకర్, టి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

చలివేంద్రాల ఏర్పాటు

పెడన: బీట్ ద హీట్ అంటూ ఉన్నతాధికారులు ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పెడన పట్టణంలో మూడో శనివారం పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. శానిటేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ ఆధ్వర్యంలో శానిటరీ కార్యదర్శులు ఆయా చలివేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా పాదచారులకు మంచినీరు అందించేలా చర్యలు చేపట్టారు. ఎండలు మండుతున్న తరుణంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వెలిబుచ్చుతున్నారు. ఆయా చలివేంద్రాలను క్రమం తప్పకుండా సద్వినియోగం అయ్యేలా చూడాలని పురప్రజలు కోరుతున్నారు.

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం వాహనదారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పలువురు వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనదారులకు మజ్జిగ అందిస్తున్న సర్పంచ్

స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ

స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది. స్థానికులచే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారిచే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

కిసాన్ డ్రోన్స్‌పై అవగాహన

మండవల్లి: ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించిన కిసాన్ డ్రోన్స్‌ను 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోందని సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణ పేర్కొన్నారు. డ్రోన్స్ పూర్తి ఖరీదు రూ.9.8 లక్షలు కాగా బ్యాంకుల ద్వారా రైతుల గ్రూపునకు, బ్యాంకు లోన్, సబ్సిడీ, రైతు వాటా కలుపుకుని అందజేస్తారన్నారు. ఏఓ ఎస్‌కే జరీనా, వీఏఏలు చాప్లిన్, గోపాల్, డ్రోన్స్ కంపెనీ ప్రతినిధి రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయం 36వ వార్షికోత్సవం, హనుమత్ జయంతి ఉత్సవాలు ఆదివారం నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ నిర్మాణ ధర్మకర్త మలిశెట్టి సాంబశివరావు (నామాలు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుఖుల నాంచారయ్యశర్మ ఆధ్వర్యంలో నిత్యం ప్రత్యేక ఆకుపూజ, చాలీసా పారాయణం పూజాధికాలు జరుగుతాయి. 22న హనుమాన్ జయంతి కార్యక్రమాలు, మహా అన్నసంతర్పణ జరుగుతుంది.

ఉపాలయాలకు శిఖర కలశాల ప్రతిష్ఠ



భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక శ్రీఅన్నపూర్ణ దేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవల కార్యక్రమాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆకెళ్ల దేవనాథ్‌శర్మ అర్చకత్వంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు–శివసత్యవతి, మెండు లక్ష్మీనారాయణ–ఉమాదేవి, అద్దంకి హనుమంతరావు- రత్నకుమారి, చిత్రాజు హనుమ– సరళ, మలిశెట్టి శ్రీనివాసరావు– లక్ష్మీ నాంచారమ్మ పీటలపై కూర్చున్నారు. ఈ సందర్భంగా మండప ప్రతిష్ఠాన దేవతల హోమం, మహా రుద్రహోమం, ధ్వజారోహణ, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కాలభైరవుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, చండీశ్వరుడి చిన్న ఉపాలయాల శిఖర కలశాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ జరిపారు. తొలుత శ్రీకాశీవిశ్వేశ్వరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, దేవతామూర్తులకు నూతన వస్త్రాలంకరణ పూజలు జరిగాయి.

25లోగా దరఖాస్తుల స్వీకరణ

గూడూరు: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న రుణాలకు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని గూడూరు ఎంపీడీఓ మోటేపల్లి వనజ తెలిపారు. రుణాలు పొందటానికి ఆసక్తి కలిగిన అర్హులైన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ మతస్తులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్హత తదితర ధ్రువీకరణపత్రాలు సమర్పించి రుణాలకు ఆన్‌లైన్ చేసుకోవాలని ఆమె కోరారు.

ఎక్కడి చెత్త అక్కడే..!

మూడో శనివారం కానరాని స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర



పెడన: ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనేది కూటమి ప్రభుత్వ ఆదేశాలు. ఈ పిలుపును పెడన మున్సిపల్ అధికారులు తుంగలో తొక్కేస్తున్నారనేందుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మూడో శనివారం దర్శనమిచ్చిన చెత్త కుప్పలే నిదర్శనం. ప్రధాన రహదారి పక్కన చెత్తను ఎత్తడానికి సమయం కేటాయించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇక వార్డుల్లో అయితే చెప్పనక్కర్లేదు. చెత్త కుప్పల వద్ద దుర్వాసనలు వెదజల్లుతూ పురప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటేనే తప్ప పనులు సక్రమంగా జరగవని పురప్రజలు అంటున్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ



మోపిదేవి: మండలంలోని పాడిరైతులకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి గుర్జాల్ బేగం తెలిపారు. శనివారం ఉదయం మోపిదేవి పశువైద్యశాలలో పశువులు ఉన్న ప్రతి రైతుకు కుటుంబానికి తొలివిడతగా బ్యాగు పశువుల దాణాను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనిట్ ధర రూ.1,110 కాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ పోను రైతు రూ.555 చెల్లించాల్సి ఉంటుందన్నారు. తొలివిడతలో మొత్తం 209 మంది రైతులకు పశువుల దాణా అందజేశామన్నారు. గ్రామ సర్పచ్ నందిగం మేరీరాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, నడకుదుటి జనార్ధనరావు, ఎంపీటీసీ కొమ్ము పవన్, మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, పాలకేంద్రం అధ్యక్షుడు బొందలపాటి ప్రసాద్, పశువైద్య సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 12 మంది ఎంపిక



చల్లపల్లి: లయన్స్‌క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో స్థానిక నర్రా సాయిబాబు రమాదేవి మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్లో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 12 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. తన భార్య నర్రా రమాదేవి జ్ఞాపకార్థం నర్రా సాయిబాబు సహకారంతో ఈ క్యాంపు ఏర్పాటు చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ చల్లపల్లి శాఖ సభ్యులు పర్యవేక్షించారు.